కథ

# రహస్యం

## పి.వి. రమణకుమార్

రాజేష్ తాను అనుకున్న విధంగానే కాస్త ఆలస్యంగానైనా జీవితంలో స్థిరపడ్డాడు. అలా అనుకున్న విధంగా స్థిరపడ్డానికి అతనో యజ్ఞమే చేశాడని చెప్పవచ్చు. ఇక మిగిలింది అతి ముఖ్యమైన పెళ్ళి.

రాజేష్‌ది మొదటి నుంచీ ఓ ప్రత్యేకమైన వ్యక్తిత్వం. అంత త్వరగా అతని మనసెవరికీ అర్థం కాదు. అదో జంతర్ మంతర్ లాంటిది. బయటి వాళ్ళే కాదు. ఆఖరికి బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు కూడా అతణ్ణి అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారు.



పెళ్ళి!

ఆ విషయంలో అతనికి పూర్తి స్వేచ్ఛ వుంది. అందుకే అతని ఆలోచనలన్నీ పెళ్ళి వైపే పరిభ్రమిస్తున్నాయి.

'ముద్దు ఎక్కడ పెట్టాలి? అసలు ముద్దు పెట్టుకుంటున్నప్పుడు కళ్ళెందుకు మూసుకుంటారు? ముద్దు పెట్టుకున్నాక కళ్ళు మూసుకుంటారా? లేక కళ్ళు మూసుకున్నాక ముద్దు పెట్టుకుంటారా?'

తన ఆలోచనకు తానే నవ్వుకున్నాడు. ప్రణయ రసాస్వాదనకి సిద్ధమైన వేళ, ప్రేయసి అందమైన చూపుల తోరణాలు కట్టి ఆహ్వానం పలుకుతున్న వేళ, అర్థం పర్థం లేని ఆలోచనలతో కాలాన్ని కాల్చేయడం మూర్ఖత్వానికి పరాకాష్ట అనిపించింది.

అందుక్కారణం!

అతని కెదురుగా కాబోయే భార్య దివ్య. అతని ఆలోచనల్లో అతనున్నాడు. ఆమె జరుగబోయే సన్నివేశానికి మనసులోనే రిహార్సల్స్ వేసుకుంటోంది. కౌగిలిలో ఒదిగి మత్తుగా మూలిగే పారవశ్యం ఎంత సేపుంటుంది? అంటే అందుకు ఎవరి సమాధానం వారికుంటుంది.

దివ్యకు తన సమాధానం తన దగ్గరుంది. కానీ ఆ సమాధానంలో ఏదో అసంతృప్తి వున్నట్టనిపించింది. నాలుగు పెదవుల నడుమ జరగబోయే సంఘర్షణకు సాక్షిగా నిలవాలని అనుకుందేమో! గదంతా నిశ్శబ్దాన్ని ధరించిన ముత్తయిదువలా నోరు నొక్కుకుంది. ఎక్కడో దూరంలో వాద్యగోష్ఠి, వాల్యూమ్ పెంచడంతో శివమెత్తినట్టుగా వినిపిస్తోంది. బయట సన్నగా మొదలైన చినుకులు హోరెత్తి జడివానలా మారాయి. ప్రకృతి ఎంత విచిత్రమైనది? అంతలోనే ఎంత మార్పు? చటుక్కున ఒక అందమైన దృశ్యం గుర్తుకొచ్చిందతనికి.

అదో స్వర్గం లాంటి అందమైన గది. మల్లెవూల పాన్పు, అగరొత్తుల పరిమళాలు గదిని సుగంధ భరితం చేస్తుంటే అతడు – ఆమె. ఆమె కోసమే జీవితమంతా వేచివున్న మౌనిలా అతడు. తొలి ఎంగిలి వేడి పాలతో పంచుకుని, ఆ ఎంగిలిని పెదవుల ముంగిళ్ళలో ముద్దుగా మలచుకుని – ఆ దృశ్యమేదో అతని కనురెప్పల తెరలో అలవోకగా కదిలిపోయింది. ఉన్నట్టుండి హఠాత్తుగా అతను ఆమెను వదిలేశాడు. ఒక సిగరెట్ వెలిగించుకున్నాడు.

రాజేష్‌లో ఈ హఠాత్ మార్పుకి కారణమేమిటో అర్థం కాక దివ్య విస్తుపోయింది. అతను మంచం మీద నుంచి లేచి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. ఆమె అందంగా వుంటుంది. ఆ విషయంలో మరో అభిప్రాయానికి తావు లేదు. ఎవరైనా ఆమెను చూసిన మరుక్షణం లోనే ఆ పాయింటుని అంగీకరిస్తారు. అతనూ మంచి అందగాడే. అందుకే ఆమెను రెండు నెలల క్రితం పెళ్ళి చూపుల్లో చూసినప్పుడు మరో మాట లేకుండా ఓకే అనేశాడు.

పెళ్ళి నిశ్చయమై పోయింది. నిశ్చితార్థం సగం పెళ్ళిలా చేయడం ఈ రోజుల్లో సాధారణమై పోయింది. మరొక నెల రోజుల్లో వాళ్ళిద్దరూ భార్యాభర్తలు కాబోతున్నారు. అంతకు ముందు రాజేష్‌కి అమ్మాయిలతో పరిచయం లేదని కాదు. కానీ ఆ విషయం అంతుకు మించి మరే విధంగానూ రూపాంతరం చెందక పోవడానికి అతను ఇంట్రావర్ట్ కావడం ఒక కారణమయితే, అతని ఆలోచనా విధానం మరొక కారణం.

జీవితం పట్ల అతనికి కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. జీవితాన్ని ఎప్పటికప్పుడు ఫ్రెష్‌గా వుంచుకోవాలన్నది అతడి ఆలోచన. లేకపోతే రొటీనిటీ. పెరిగిపోయి బ్రతకగలమేమో కానీ, జీవించలేం. ఇదే విషయాల గురించి ఆలోచిస్తూ, బయట కురుస్తున్న వర్షాన్ని చూస్తూ రింగులు రింగులుగా పొగ వదులుతున్నాడు రాజేష్.

"ఏమిటాలోచిస్తున్నారు?" ప్రశ్నించిందామె మంచం మీది నుంచి దిగివచ్చి అతడి కెదురుగా వున్న మరొక కుర్చీలో కూర్చుంటూ.

"ఏమీ లేదు" అన్నాడతను.

దివ్య ఆ రూముకి వచ్చి రెండు గంటలు దాటుతోంది. పెళ్ళి నిశ్చయించుకున్న తర్వాత వాళ్ళిద్దరూ కలుసుకోవడం అప్పుడప్పుడూ జరుగుతూ వస్తోంది. మ్యారేజీ సెటిలయ్యాక అమ్మాయీ, అబ్బాయీ కలసుకోవడం, బాతాఖానీ వేసుకోవడం, కాఫీ తాగుతూ కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడటం, చీకట్లో సినిమా చూస్తూ చేతులు తగిలీ తగలనట్టు పొందే స్పర్శానుభూతి ఎంతో థ్రిల్లింగ్‌గా వుంటుంది.

వాళ్ళిద్దరూ ఇలాంటి థ్రిల్స్ పంచుకున్నారు. అయితే అతడి రూమ్‌కి ఆమె రావడం మాత్రం ఇదే ప్రథమం. షాపింగుకని బజారుకొచ్చిన దివ్య అనుకోకుండా వర్షం రావడంతో, దగ్గర్లోనే వున్న రాజేష్ రూమ్‌కొచ్చింది. వర్షం వల్ల బయట చల్లదనం. ఆమె గురించిన ఊహాలతో గదిలోనూ, అతని మదిలోనూ వెచ్చదనం.

తడిసి ముద్దయ్యి గులాబీ రంగు డ్రెస్‌లో నిల్చుని కొత్త అందాలు సంతరించుకున్న రోజా పూవులా వుంది దివ్య. ఆమె తన రూమ్‌కి రావడం గొప్పగా ఫీలయ్యాడు రాజేష్. మొదటి అరగంట వ్యక్తిగత విషయాల తోనూ, ఆ తర్వాత అరగంటలో మిగతా విషయాలూ పిచ్చాపాటీగా మాట్లాడుకున్నారు. మరింతగా పెరిగిన చలిగాలి ఇద్దరి శరీరాల్లో ఏదో ఆరాటాన్ని నింపుతోంది.

సరిగ్గా అదే సమయంలో కరెంటు పోయింది. కొవ్వొత్తి వెలిగిద్దామని అతడు లేచాడు. ఆమె కూడా ఎందుకో లేచి నిలబడింది. అనుకోకుండా తగిలిన ఇద్దరి శరీరాల మధ్యన వేడి మరింత అధికమైంది. కౌగిలి బిగిసింది. అలాగే ఇద్దరూ మంచం వరకూ నడిచారు. ఇంతలో ఏమనుకున్నాడో ఏమో చటుక్కున ఆమెను వదిలేశాడు. తిరిగి సంభాషణను కొనసాగించాలన్న ఉద్దేశంతో–

"ఏం లేదంటారేమిటి? ఏదో ఒకటి ఆలోచించాలి కదా!" అన్నది.

రాజేష్ నవ్వాడు. కానీ వెంటనే సమాధానం చెప్పలేదు. దివ్య మళ్ళీ–

"హఠాత్తుగా అలా జరిగిపోయారేం?" అడిగింది ఒకింత రొమాన్స్ నిండిన గొంతుతో. రాజేష్ ఆశ్చర్యపోయాడు. చాలామంది ఆడవాళ్ళు కేవలం భర్త సుఖం కోసం మాత్రమే తామున్నట్టుగా బ్రతికేస్తుంటారు. లేదా నటిస్తుంటారు. ఈ విషయమై గతంలో ఒకసారి ఇద్దరి మధ్యా సంభాషణ జరిగినప్పుడు–

"శృంగారం అనేది ఇద్దరికీ సంబంధించిన వ్యవహారం. అందులో ఆడది కేవలం స్లీపింగ్ పార్ట్‌నర్ అంటే నేనొప్పుకోను" అని తన అభిప్రాయాన్ని చెప్పింది దివ్య.

దివ్య అంత బోల్డ్‌గా మాట్లాడుతుందని తెలియని రాజేష్ మొదట్లో ఆశ్చర్యపోయాడు. కానీ అతను మిగిలిన మగాళ్ళలా ఆడవాళ్ళని నెగెటివ్ దృష్టితో చూడటం అలవర్చుకోలేదు. అందుకే హిపోక్రసీ లేని ఆ ఫ్రాంక్‌నెస్‌ని సిన్సియర్‌గా అభినందించాడు.

"ఈ పద్ధతి అంతగా నచ్చలేదు" అన్నాడు కాసేపు ఆలోచించి.

"మనిద్దరికీ పెళ్ళి నిశ్చయమైంది. మరొక నెల రోజుల్లో మనం భార్యాభర్తలం కాబోతున్నాం. కలసి హోటల్స్‌కీ, సినిమాలకీ వెళ్ళాం. కలసి చాలా చోట్లకు వెళ్ళాం. అఫ్‌కోర్స్! ఎంతో కొంత స్పర్శ మాత్రంగానైనా ఎంజాయ్



## రాణీ డైటింగ్

బొద్దుగా, లావుగా ఉన్న తన శరీరంలోని కొన్ని అవయవాల్ని సన్న బరచడం కోసం రాణీ ముఖర్జీ పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావట. అంత కష్టపడి సన్నబడ్డాక తీసిన 'మెహెందీ' సినిమాలో తన అందాన్ని తెరమీద చూసుకున్నాక చాలా తృప్తిగా అన్పించిందట. ముఖ్యంగా నేను సన్నబడ్డం కోసం సహకరించిన అతనికి ఎలా కృతజ్ఞతలు చెప్పకోవాలో? అంటోంది. ఇంతకీ ఎవరతను?

చేశాం. మరి ఈరోజు వున్నట్టుండి మీరు తప్ప చేసిన విధంగా ఫీలవ్వాల్సిన అవసరం లేదేమో!" కొంచెం సూటిగానే అడిగేసింది.

రాజేష్ సమాధానం చెప్పలేదు.

"ఏమిటీ? ఇలా మాట్లాడుతున్నదని మీరు అనుకోవచ్చు. నా మాటలు బరితెగించినవిగా కూడా అనిపించవచ్చు. కానీ జీవితాన్ని పంచుకోబోయే వాళ్ళం మనం. మన ఆలోచనలు ఇద్దరికీ తెలియాలి" ఆమె కన్విన్సింగ్ ధోరణిలో చెప్పింది.

అవునన్నట్టు తలూపాడు రాజేష్.

"నేననేదేమిటంటే ఎలాగూ పెళ్ళి చేసుకుంటున్నాం కదా! ముందే 'అది' కానిస్తే ఏం? అని కాదు. అనుకోకుండా కలసివచ్చినప్పుడు, వాతావరణం కూడా అందుకు దోహదం చేసినప్పుడు చివరి నిమిషంలో తగ్గడానికి కారణమేమిటో తెలుసుకుందామనే మీరు ఇక్కడ మరొక విషయం కూడా అర్ధం చేసుకోవాలి. మన కలయిక జరగకపోవడం వల్ల వేడెక్కిన నా శరీరం నా చేత ఈ మాటలనిపిస్తున్నదేమో! అని ఆలోచించొద్దు. చిన్నప్పటి మంచీ ఫ్రాంక్‌గా మాట్లాడ్డం నాకలవాటు. నా మాటల్లో ఏదైనా తప్పంతదని భావిస్తున్నారా?" కూల్‌గా స్వీట్ నథింగ్స్ చెబుతున్న వాయిస్‌లోనే అన్నది. ఎవరైనా కన్విన్స్ అయ్యే విధంగానే వుంది ఆమె చెప్పే విధానం.

"లేదు. తప్ప కాదు. నిజానికి నీ అందం కన్నా నీ ఫ్రాంక్‌నెస్ అంటేనే నాకు చెప్పలేనంత ఇష్టం. ఇప్పుడు జరిగిన ఇన్సిడెంట్ మనం మరింతగా, మన ఇద్దరి గురించి లోతుగా తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందేమో!" క్షణం ఆగి చెప్పాడు.

"జీవితాన్ని ఎప్పటికప్పుడు ఫ్రెష్‌గా వుంచుకోవాలి. లేకపోతే రొటీన్ అయిపోయి బోర్ కొడుతుంది. అందుకోసం మనం ప్రత్యేకంగా ఏమీ ప్రయత్నించ నవసరం లేదు కూడా. లైఫ్‌లో చాలామంది చాలా మమూలుగా తీసుకునే విషయాలను కొంత ఫ్రెష్‌గా వుంచుకో గలిగితే చాలు. వేగం పెరిగిపోయి, విలువలు తరిగిపోతున్న ప్రస్తుత ప్రపంచంలో నిన్నటికీ, నేటికీ, రేపటికీ తేడా తెలియకుండా బ్రతికేయడం నాకు ఇష్టం లేదు. ఏ రోజుని ఆరోజుగా అనుభవించాలనుకుంటాను. అలాగని నేదో విలువల కోసం తాపత్రయ పడతాననో, ఆదర్శవాదిననో కాను. ఇది నా ఒక్కడికి మాత్రమే సంబంధించినది. రేపు మనం భార్యాభర్తలం కాబోతున్నాం కాబట్టే ఇంత చెప్పాల్సి వచ్చి చెబుతున్నాను" అని ఆగాడు. ఆమె వింటున్నది. ఆమెకిదంతా వెరయిటీగా అనిపిస్తోంది.

'మ్యారేజి సెటిలయిన విషయం నాకూ తెలుసు. రాబోయే లైఫ్ పార్ట్‌నర్ గురించి నాకు చాలా ఆలోచనలు వున్నాయి. ఏ మగాడికైనా వుంటాయి అనే అనుకుంటున్నాను. నా చేతులు నా కాబోయే భార్య చుట్టూ ఆలనగా, తొలిసారిగా బిగుసుకుంటున్నప్పుడు ఒక మంచు బిందువు జారితే ఆ తాకిడికి వువ్వు ఎలా వులకరిస్తుందో, ఆ వులకరింతను నేను నా భార్య నుంచి వాంఛిస్తాను. నా పెదవులు ఆ పెదవులతో కలసినప్పుడు, ఆ అధరాల వణుకును నేను స్పష్టంగా చూడాలి.

ఒకే 'రహస్యాన్ని' ఇద్దరం తొలిసారి శోధిస్తున్నప్పుడు అమెచ్యూర్స్‌లా ప్రారంభించి, ఒక్కో సోపానం అధిరోహిస్తూ శిఖరాగ్రతను చేరుకోవడంలోని తృప్తిని కలసి పంచుకోవాలన్నది నా కోరిక. కొన్ని అనుభూతులను అనుభవించాల్సినప్పుడే అనుభవించాలి తప్ప ఆరాటపడి కోల్పోతే థ్రిల్లేముంటుంది?" తన ధోరణిలో తాను చెప్పేశాడు.

విస్మయంగా చూసింది.

"హడావిడి, ఆర్భాటాలతో తంతుగా సాగిపోయే మొదటి రాత్రి ఎలాంటి అనుభూతినీ ప్రత్యేకంగా తీసుకురాలేకపోతే అది నిజంగా గొప్ప దురదృష్టం. అందుకే..."

"అందుకే!" ఆసక్తిగా అడిగింది.

"కొన్ని రోజుల తర్వాత ఓ అందమైన సందర్భంలో ఇద్దరం కలసి ఆ అనుభవాన్ని పంచుకుని ఆ రహస్యాన్ని శోధించుదాం" పూర్తి చేశాడు.

దివ్య అస్పష్టంగా తలూపింది. వర్షం ఆగిపోయింది. ఆమె కొంచెం సేపటి తర్వాత వెళ్ళిపోయింది.

అయితే అనుకున్నట్టుగా నెల రోజుల తర్వాత వాళ్ళ పెళ్ళి జరగలేదు. వారిద్దరి మధ్యా జరిగిన ఆ విచిత్రమైన సంఘటన తర్వాత నాలుగు రోజులకి ఆమె నుంచి అతనికో లెటర్ వచ్చింది.

*"సారీ!*

*మన పెళ్ళి జరగదు. మీకు కాబోయే జీవిత భాగస్వామి గురించి మీకు ఎన్నో అభిరుచులున్నాయి, ఆలోచనలున్నాయి. అనుభూతులున్నాయి. ఒక రహస్యాన్ని ఫ్రెష్‌గా శోధించాలని మీ చిరకాల వాంఛ. నిజం చెబుతున్నాను. నేను ఫ్రెష్ కాదు. మీరూ కాదనే అనుకుని, అన్యాయం చేయడం ఇష్టం లేక ఈ పెళ్ళి రద్దు చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. నాదో సజెషన్. ఇక ముందెప్పుడూ కాబోయే లైఫ్.పార్ట్‌నర్ ముందు 'ఈ రహస్య పరిశోధన' గురించి చర్చించకండి. ఇదో పిచ్చి అన్వేషణగా భావించి మిమ్మల్ని హేళన చేస్తారు.*

*ఇంక సెలవ్. గుడ్‌బై.*

*-దివ్య*

మంచు తుపాను ముఖానికి తాకినట్టయ్యింది. రాజేష్ శూన్యంలోకి చూపు నిలిపాడు. సరిగ్గా అదే సమయంలో తాను సృష్టించిన అబద్దపు ఉత్తరం ఓ ఉన్మాది నుంచి తనను రక్షించినందుకు దివ్య సంతోషించింది.